చిన్నకథ మయూరి సచిత్రవారపత్రిక 31 జనవరి 92



# జాగ్రత్త రాయుడు

చిరాకుగా తోటలో పవార్లు వేస్తున్న రావుగారి దృష్టి, హఠాత్తుగా, గేటు ముందు తచ్చాడుతున్న ఒక యువకుడి మీద పడింది.

ఆయన తిన్నగా గేటు దగ్గరికి వెళ్ళి, "లోపలికి రా" అంటూ యువకుడ్ని ఆజ్ఞాపించారు.

"సార్, నేను... నేను..." యువకుడు తత్తర పడ్డాడు.

"నాకు అంతా తెలుసు. నువ్వు రాజ శేఖరం అబ్బాయివేగా. మాట్లాడకుండా లోపలికి రా" అంటూ రావుగారు యువకుడి చేయి పట్టుకుని లోపలికి ఈడ్చుకొచ్చారు.

కుర్చీ చూపించి "కూర్చో" అని ఆజ్ఞాపించారు.

"సార్... నేను..." యువకుడు మళ్ళీ ఏదో చెప్పబోయాడు.

"షటప్ అండ్ సిడౌన్. నీకు పెద్దలంటే బొత్తిగా గౌరవం ఉన్నట్లు లేదే" అని రావుగారు గద్దించేసరికి యువకుడు మారు మాట్లాడకుండా కూర్చుండి పోయాడు.

"రంగమ్మా, రెండు కాఫీలు తీసుకురా" అని గావుకేక వేశారు రావుగారు.

క్షణంలో కాఫీలు వచ్చాయి.

"వద్దండి" అని రావుగారి మొహం చూసి కాఫీకప్పు చేతిలోకి తీసుకున్నాడు యువకుడు.

రావుగారు విందుగా నవ్వేశారు.

"చూడవోయ్. నేను కూడా ఒకప్పుడు నీలాగే తెగ మొహమాట పడిపోయేవాడిని. తర్వాత్తర్వాత నాకు తెలిసింది ఏమిటంటే ఈ ప్రపంచంలో ఎవ్వరికి భయపడకూడదని. హ్హహ్హహ్హా... అర్థమయ్యిందా?"

"అయ్యిందండి."

"గుడ్. నేను చూడు. నా భార్యకు కూడా భయపడను. మన పని మనం చేస్తూ పోతే ఎవరికి మాత్రం ఎందుకు భయపడాలి. వంట, బట్టలుతకడం వగైరా వగైరా అన్నీ నీట్‌గా నేనే చేసేస్తాను. ఇంకెందుకు భయపడాలి?"

"యస్సార్."

"నేను మిల్రటీలో పనిచేసిన మనిషిని. భయం గియం కుచ్ జానాౖౖనై. ఒకసారే మయ్యిందో తెలుసా?"

"తెలీదండి."

"నేను యుద్ధానికి వెళ్తూ ఉంటే హఠాత్తుగా ఓ సింహం ఎదురయ్యింది. నేనేమన్నా పిరికి వెధవలా భయపడి పారిపోయాననుకున్నావా. ఏమీ లేదు నువు చెబితే నమ్మవు కాని నేను అస్సలు భయపడలేదు. నా తుపాకీతో సహా దక్కున ఓ పెద్ద చెట్టుని ఎక్కిపోయి, దాదాపు ఐదు గంటలు అక్కడే కూర్చుండిపోయాను. విసుగెత్తి విసుగెత్తి చివరకు సింహమే వెళ్ళిపోయింది. హ్హా హ్హా హ్హా..." రావుగారు పగలబడి నవ్వసాగారు.

ఆ నవ్వుకి యువకుడి గుండెలు గుభేల్‌మన్నాయి. దానితో పాటు చేతిలోంచి కప్పు కూడా జారి పడిపోయింది. నేరకపోయి ఈయన కళ్ళల్లో పడ్డాను దేవుడా అనుకున్నాడు.



కె. ఆదర్శ సామ్రాట్

పగిలిన కప్పు వంక చూసి, నవ్వడం ఆపి, మళ్ళీ రావుగారు ఎత్తుకున్నారు. "ఏమిటోయ్ నిండా పాతికేళ్ళు లేనివాడివి. ఇంత అజాగ్రత్తగా ఉంటే ఎలా? అసలు మనం ఏ పని చేసినా

చాలా జాగ్రత్తగా చెయ్యాలోయ్. నా మట్టుకు నేను ప్రతి పనిని చూసి చూసి మరీ పూర్తి చేస్తాను. రోడ్డు మీద నడిచేటప్పుడు నేనేం చేస్తానో నీకేమైనా తెలుసా?''

''తెలీదండి.''

''శత్రువులెవరైనా ఉన్నారేమోనని జాగ్రత్తగా గమనిస్తుంటాను. బయటకు వెళ్ళేటప్పుడు పొరపాటున కూడా నా జేబులో తుపాకి ఉంచుకోవటం మర్చిపోను. ఇంట్లో ఉన్న ప్పుడు కూడా ఇరవై నాలుగ్గంటలూ నా జేబులో తుపాకి ఉంటూనే ఉంటుంది. రాత్రి పూట నిద్రపోయేటప్పుడు నేనేం చేస్తానో నీకు తెలుసా?''

''తె... తె... తెలీదండి.''




''తలుపులు, కిటికీలు అన్నీ నేనే స్వయంగా మూస్తాను. నిద్రపోయేటప్పుడు నా అల్మారాకి కరెంట్ కనెక్షన్ ఇచ్చి నిద్రపోతాను. అందులో ఏమేమున్నాయో నీకు తెలుసా. అరవై వేల రూపాయల నగలు, ఇరవై ఐదువేల నగదు ఉన్నాయి. అవన్నీ మా మామగారు ఇచ్చినవి. ఒక వేళ నేను నిద్రపోయేటప్పుడు ఏ దొంగలైనా వాటిని తీయాలని ప్రయత్నిస్తే కరెంట్ షాక్ తగిలి ఢామ్మని చచ్చిపోతారు. హ్హా హ్హా హ్హా... అర్థమయ్యిందా?''

''అ...అ... అయ్యిందండి.''

''...ఈ వయసులో కూడా నాకు సంబంధించిన విషయాల్లో నేనింత జాగ్రత్తగా ఉంటే ఆఫ్టరాల్ నువ్వొక కాఫీ కప్పుని కూడా జాగ్రత్తగా రక్షించలేక పోతున్నావంటే నాకు చాలా బాధగా ఉందోయ్. ఐ పిటీ యూ'' అన్నారు రావుగారు.

''ఐ టూ సార్'' అన్నాడు యువకుడు ఏమనాలో తోచక.

అంతలోనే రావుగారికి హఠాత్తుగా ఏదో అనుమానం వచ్చింది.

అంతే.

ఉన్నఫళంగా ఆయన జేబులోంచి పిస్టల్‌ని తీసి యువకుడికి గురిపెడుతూ ''ఎవరు నువ్వు?'' అంటూ గర్జించారు.

యువకుడికి గింగిరాలు తిరిగిపోయాయి. నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది.

''మా రాజశేఖరం అబ్బాయికి చెవి మీద పుట్టుమచ్చ ఉండాలి. నీకు లేదు. అంటే నువ్వు ఇంకెవరివో అన్నమాట. ఊ. ఇప్పుడు చెప్పు. ఎందుకొచ్చావిక్కడికి?''

యువకుడు విలువు గుడ్లు వేసేసి ''సార్... నే...ను. నే...ను...'' అంటూ ఏదో చెప్పబోయాడు.

''షటప్. నువ్వు నాకు ఏమీ చెప్పొద్దు. నీ కల్లబొల్లి మాటలు నమ్మేంత వెర్రివాణ్ని కాదు—నేను. అన్నిట్లోను ఎంతో జాగ్రత్త పడతాను. నువ్వు మా ఇంట్లో దొంగతనం చెయ్యడానికి వచ్చావు. అవునా? అవునని ఒప్పుకో. లేకపోతే కాల్చి పారేస్తాను'' ట్రిగ్గర్ మీద వేలు నొక్కుతూ రావుగారు గద్దించారు.

అవునని ఒప్పుకోడానికి పాపం ఆ యువకుడు స్పృహలో ఉంటేగా.

స్నేహితుడి ఇల్లు వెతుక్కుంటూ, ఈ జాగ్రత్త రాయుడి కంట పడిన పాపానికి అప్పటికే దిమ్మతిరిగి సోఫాలో కూలబడిపోయాడు. ●

రూ 1,50,000 బహుమతులు
గెలుచుకోండి (ఎంట్రీ ఫీజులేదు)



| | | |
|---|---|---|
| 9 | 8 | 13 |
| 14 | 10 | 6 |
| 7 | 12 | 11 |

మొదటి బహుమతి బజాజ్ స్కూటర్
లేక వి.సి.ఆర్. కన్సొలేషన్ బహుమతులు: రూ. 800కు కలర్ టి.వి. లేదా జపాన్ మోడల్ నేషనల్ టూ ఇన్ వన్ 500రూపాయలకే చైన్ లింక్ పథకం క్రింద పోస్టు కార్డుపై పైన చూపిన విధంగా 9 గళ్ళు గీయండి. 7 నుండి 15 వరకు అంకెల్ని ఉపయోగిస్తూ ఎటు కూడినా 33 వచ్చేలా గళ్ళు నింపండి. ఒక అంకె ఒకసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను పోస్ట్ కార్డ్‌పై ఆర్డినరీ పోస్టుద్వారా 10 రోజుల్లోగా పంపండి. మొదటి 20 ఎంట్రీలకు ఫోటో గ్రాఫిక్ కెమేరా ఉచితం.

| | | |
|---|---|---|
| | | |
| 15 | 11 | 7 |
| | | |

AIR LINKERS (WT-97)
Post Box No: 4918, S.J. Encl., NEW DELHI: 110 029